
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 5 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.133
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.133 పలికింది. కనిష్టం రూ.80, సరాసరి రూ.106 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.8°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తి



అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో ఉన్న అంజినప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. వలంటీర్లు ఇంటింటికీ తిరగడంతో పాటు సుదూర ప్రాంతాల్లో, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే పింఛన్ మొత్తం అందించడంతో నాలుగోరోజు శుక్రవారం నాటికి జిల్లాలో 99 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో 2,61,340 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.72,55,75,250 మంజూరు చేశారు. నాలుగు రోజుల్లో వలంటీర్లు 2,57,229 మందికి రూ. 71,41,45,500 అందజేశారు.

నోటీసు ఇచ్చాకే తొలగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జాబితా నుంచి ఓటు తొలగించాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని, వివరణ తర్వాతే తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జేసీ చేతన్‌తో కలిసి ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల విధుల్లో వలంటీర్లను ఎట్టిపరిస్థితుల్లో భాగస్వామ్యం చేయకూడదన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఈనెల 21వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. వివాహమై ఇతర గ్రామాలకు వెళ్లిన మహిళల ఓట్ల తొలగింపులో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఓటరు ఇంటి సంఖ్య తప్పనిసరిగా వేయాలన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు పక్కా ఆధారాలు తీసుకోవాలన్నారు.

బాల్యం బందిఖానా!

- ఐదేళ్లు నిండని విద్యార్థులకు ప్రైవేటు 'కోచింగ్'!
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఏకధాటిగా తరగతులు
- ప్రతి నెలా రూ.వెయ్యి నుంచి రూ.6 వేల వరకు వసూలు
- కోచింగ్, బేసిక్స్, ప్రీ స్కూల్స్ పేరుతో దోపిడీ
- ఏళ్లుగా నడుస్తున్నా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



సాక్షి, పుట్టపర్తి: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ప్రైవేటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ ఒకే ఏడాదిలో పూర్తి చేయిస్తామని భారీగా ఫీజులు దండుకుంటున్నారు. పది నెలల్లో కోర్సు ముగుస్తుందని నేరుగా పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించొచ్చని తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుల పేరుతో చిన్నారులకు నరకం చూపిస్తున్నారు.

తల్లిదండ్రులను మభ్యపెట్టి...

శ్రీసత్యసాయి బాబా ప్రైమరీ, ఈశ్వరమ్మ పాఠశాలల్లో ప్రవేశాలకు గతంలో ప్రవేశ పరీక్ష నిర్వహించేవారు. ప్రతిభ ఆధారంగా సీట్లు ఇచ్చేవారు. ఇదే అదునుగా పుట్టపర్తిలో కోచింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. అయితే కొంతకాలంగా లాటరీ విధానం తీసుకొచ్చారు. అయినా తల్లిదండ్రులను కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు మభ్యపెడుతున్నారు. బురిడీ కొట్టించి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. మూడేళ్ల వయసు చిన్నారులకు రోజంతా కూర్చొనే సామర్థ్యమే ఉండదు. వారికి కోచింగ్ ఏంటని ఎవరైనా ప్రశ్నిస్తే... ''తప్పదు సార్.. ఇక్కడ ఏడాది కోచింగ్ తీసుకుంటే మంచి పాఠశాలల్లో సీట్లు వస్తాయి' అంటూ నమ్మబలుకుతున్నారు.

ఏడాదికి రూ.50 వేలకు పైగా...

కోచింగ్ సెంటర్, బేసిక్ స్కూళ్లలో ఒక్కో చిన్నారిపై ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. సగటున నెలకు రూ.4 వేల చొప్పున పది నెలలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా పుస్తకాలతో పాటు హాస్టల్‌లో ఉంటే అదనంగా మరో రూ.30 వేలు ఇవ్వాలి. డ్రై క్లీనింగ్, కేర్ టేకర్, మెడికల్ పేరుతో మరో రూ.10 వేల భారం మోపుతున్నారు.

ఇవీ నిబంధనలు..

విద్యాశాఖ నిబంధనల ప్రకారం స్కూల్ నిర్వహిస్తే తప్పనిసరిగా అనుమతులు ఉండాలి. కోచింగ్ సెంటర్‌కు అనుమతులు అవసరం లేదు. కానీ రోజంతా తరగతులు నిర్వహించాలంటే అనుమతులు తీసుకోవాల్సిందే. కోచింగ్ సెంటర్లు అంటే ఉదయం, సాయంత్రం వేళ్లలో బడి వేళలు ముగిసిన తర్వాత మాత్రమే నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయి. కానీ పుట్టపర్తిలోని చాలా బేసిక్ స్కూళ్లు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు విద్యాశాఖలోని కొందరు అధికారులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. అందువల్లే ఎవరైనా ప్రశ్నించినా... 'విద్యా శాఖాధికారులు ఎవరూ రారు. వారికి ఇవ్వాల్సింది వారికిచ్చేశాం. మీకేం ఇబ్బంది ఉండదు. పిల్లలను చేర్పించండి' అంటూ నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు.

కొత్తచెరువులోని శ్రీచైతన్యలోనూ..

పుట్టపర్తితో పాటు కొత్తచెరువులోని శ్రీచైతన్య పాఠశాలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు అనుమతులు ఉన్నాయి. కానీ అనుమతిలేకుండానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ కూడా నిర్వహిస్తున్నారు. అధికారులు పరిశీలనకు వస్తే ఒకటో తరగతిగా చెబుతారు. ఫలితంగా పుట్టపర్తి, కొత్తచెరువులో చిన్నారులు బాల్యంలోనే అనారోగ్యం బారిన పడుతున్నారు.

- పుట్టపర్తి సమీపంలోని చిత్రావది నది పరీవాహక ప్రాంతంలో పదేళ్లుగా ఓ కోచింగ్ సెంటర్ నడుస్తోంది. అక్కడ ఎల్కేజీ నుంచి మూడో తరగతి వరకు విద్యార్థులున్నారు. ఎల్కేజీ డేస్కాలర్స్‌కు నెలకు రూ.1,500, హాస్టల్లో ఉండే వారికి రూ.6,200గా ఫీజు నిర్ణయించారు. ఇక్కడ చదివితే బేసిక్స్‌లో ప్రావీణ్యం వస్తుందని నిర్వాహకులు ప్రచారం చేస్తుంటారు. ఐదేళ్ల లోపు చిన్నారులను తరగతుల్లో కూర్చోబెట్టి అనారోగ్యం బారిన పడేలా చేస్తున్నారు.

- పుట్టపర్తిలోని సాయినగర్ సమీపంలో చిత్రావతి నది ఒడ్డున ఇటీవల ఇంకో బేసిక్ స్కూల్ వెలసింది. నిర్వాహకుడు ప్రతి రెండేళ్లకు ఓసారి బ్రాంచ్‌లు మారుస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎల్కేజీ నుంచి ఐదో తరగతి వరకు రోజంతా అనధికారికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. అర్హత ఉండే సిబ్బంది కూడా లేరు. అయినా డేస్కాలర్స్‌కు నెలకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. హాస్టల్‌కు అదనంగా నెలకు రూ.3,200 తీసుకుంటున్నారు.

- పుట్టపర్తి బైపాస్ నుంచి ప్రశాంతి నిలయం వెళ్లే మార్గంలో ఇంకో స్కూల్ ఉంది. ఇక్కడ నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.3 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. తరగతుల నిర్వహణకు సంబంధించి అనుమతుల్లేవు. అయినా యథేచ్ఛగా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు.

పిల్లలను చేర్చవద్దు



కోచింగ్ సెంటర్లు, బేసిక్ స్కూళ్లలో రోజంతా తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేదు. తల్లిదండ్రులూ తమ పిల్లల్ని ఇలాంటి వాటిల్లో చేర్చవద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే కోచింగ్ నిర్వహించుకోవచ్చు. బేసిక్ స్కూల్స్ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. లేదంటే తరగతులు రద్దు చేస్తాం. – యు.మీనాక్షి, డీఈఓ

దోపిడీ చరిత్ర నీదే బాబూ



వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- రెయిన్‌గన్‌ల పేరుతో రూ.300 కోట్లు దోచుకుంది నిజం కాదా..?
- నేరస్తుడిని పక్కన పెట్టుకుని మాపై నేరారోపణ చేస్తే ఎవ్వరూ నమ్మరు
- కదిరిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయం
- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్న చంద్రబాబు తన హయాంలో ఏం చేశాడో చెప్పలేక...ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడలేక.. చివరకు అధికార పార్టీ నాయకులను దోపిడీదారులంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి విమర్శించారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ముగింపు సభను శుక్రవారం పట్టణంలోని బాలుర కళాశాల ఆవరణలో నిర్వహించారు. అంతకుముందు కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాలేజ్ సర్కిల్ నుంచి ప్రారంభమై ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్, జీవిమాను సర్కిల్ టవర్ క్లాక్ మీదుగా కాలేజ్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా అభిమానులు వేమారెడ్డి సర్కిల్, జీవిమాను సర్కిళ్ల వద్ద ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డికి క్రేన్‌తో గజమాలలు వేశారు. అనంతరం కాలేజీ సర్కిల్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని 93 సచివాలయాల పరిధిలో 206 రోజులు పర్యటించి 1,00,516 గడపలను సందర్శించామన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ ఆసరా ద్వారా నియోజకవర్గంలోని 41,316 కుటుంబాలకు, అమ్మఒడి, చేదోడు, వసతి దీవెన ద్వారా 62,963 కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే ప్రతి నెలా 47,276 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోందన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్, రైతు భరోసా పథకాల ద్వారా 60,651 కుటుంబాలకు, నేతన్న నేస్తం, ఈబీసీ నేస్తం, వాహన మిత్ర, చేయూత వంటి కార్యక్రమాల ద్వారా 25,027 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

రెయిన్‌గన్ల పేరుతో దోపిడీ

టీడీపీ హయాంలో (2014 – 2019) కరువు కరాళ నృత్యం చేయగా, సీఎం హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించిన చంద్రబాబు..సాయం మాట పక్కన పెట్టి రెయిన్‌గన్ల పేరుతో రూ.300 కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు దోపిడీ గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుతున్నారన్నారు. 12 ఏళ్ల జైలు శిక్ష పడిన నేరస్తుడు కందికుంటకు కదిరి టికెట్ ఇస్తానని చంద్రబాబు ప్రకటించడం చూస్తే ఆ పార్టీ వైఖరి ఏమిటో తెలుస్తుందన్నారు. తాను ఇసుక వ్యాపారం చేస్తున్నానని, కర్ణాటక మద్యం విక్రయిస్తున్నానని చంద్రబాబు ఆరోపించారని, ఆ పనులు చేసే వారు ఎవరో జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. తాను రాజకీయాల్లోకి రాక ముందు వైద్యుడిగా ఉన్నానని, తన కోటులాగే తన చరిత్రా క్లీన్‌గా ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో హంద్రీనీవా కాలువ ద్వారా కదిరి నియోజకవర్గంలో అన్ని చెరువులను నింపామని, కదిరి బైపాస్ రోడ్డు త్వరలోనే పూర్తవుతుందన్నారు. 150 గ్రామాలకు రహదారులు నిర్మించామని, ఇలా కోట్లాది రూపాయలతో కదిరిలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు జగనన్ననే కోరుకుంటున్నారని, ప్రజలందరి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో కదిరిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమన్నారు.

రైతుల వరదాయిని జిల్లేడు బండ

- రూ.680 కోట్ల వ్యయంతో శరవేగంగా నిర్మాణ పనులు
- ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే 23 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- సస్యశ్యామలం కానున్న ధర్మవరం నియోజకవర్గం
- ఆయకట్టుకు నీరందించే విధానాన్ని వివరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



జిల్లేడు బండ పనులు, కలిగే లాభాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: జిల్లేడు బండ రిజర్వాయర్ రైతుల వరదాయినిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లి తండా సమీపంలో నిర్మిస్తున్న జిల్లేడు బండ రిజర్వాయర్ పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ వద్ద రైతులు, ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రాజెక్ట్ పనులు, నిర్మాణం పూర్తయితే కలిగే లాభాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ... 2019వ సంవత్సరంలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం 'పథకం ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్మవరానికి వచ్చినప్పుడు నియోజకవర్గానికి ఒక రిజర్వాయర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. సానుకూలంగా స్పందించిన జగనన్న జిల్లేడుబండ వద్ద రిజర్వాయర్ కట్టేందుకు రూ.680 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల 23 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. కుడి కాలువ కింద 5 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 18 వేల ఎకరాల ఆయకట్టు ద్వారా నీరందిస్తామన్నారు. ఫలితంగా ముదిగుబ్బ, ధర్మవరం మండలాలకు సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. ఇప్పటికే ప్రాజెక్ట్‌లో 26 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

గ్రావిటీతో నీరు

హంద్రీనీవా కాలువ సముద్రమట్టానికి 442 మీటర్ల ఎత్తులో ఉండగా, జిల్లేడు బండ ప్రాజెక్ట్ 398.5 మీటర్లు తగ్గులో ఉందని, దీనివల్ల నీరు గ్రావిటీగా పంపింగ్ అవుతుందన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా ద్వారా జిల్లేడుబండకు 2.41 టీఎంసీల నీరందిస్తారన్నారు. అందులో 0.23 టీఎంసీలు డెడ్‌స్టోరేజీగా నిర్ణయించారన్నారు. ఇక లైవ్‌స్టోరేజ్ కెపాసిటీ 2.18 టీఎంసీలు కాగా, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు 0.3 టీఎంసీలు, పంటల సాగుకు 1.84 టీఎంసీలు కేటాయించినట్లు వెల్లడించారు.

1,738 ఎకరాల భూసేకరణ

ప్రాజెక్ట్ కింద ముదిగుబ్బ మండలంలోని శాగాపురం, గుంజేపల్లి, మంగళమడక, బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం, మారాల గ్రామాలకు చెందిన 1,738 ఎకరాలను సేకరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రాజెక్ట్ కింద ఏ ఒక్క గ్రామం ముంపునకు గురి కాకుండా డిజైన్ రూపొందించామన్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అంకితమిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఓర్చుకోలేకే ప్రతిపక్షాల విమర్శలు

23 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే విధంగా జిల్లేడు బండను నిర్మిస్తుంటే ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, టీడీపీ, జనసేన ఓర్వలేక పోతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా జిల్లేడుబండపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టడంతో పాటు ప్రాజెక్టు గురించి రైతులకు సవివరంగా తెలియజెప్పేందుకు తాను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచ్‌లు పృథ్వీనాయక్, నాగభూషణ, మేనీబాయ్, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బయపరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రాయుడు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

అనంతపురం కల్చరల్: భారతీయ కళావేదిక సంస్కార భారతి ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా యువతీ యువకులకు కవితా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంస్కార భారతి ప్రతినిధులు రామ్‌కుమార్, లక్ష్మీ ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. 'స్వాతంత్ర్య పోరాటంలో యువత పాత్ర ' అనే అంశంపై కవితలు ఈనెల 10లోపు పంపాలన్నారు. ఎంపికైన కవితలకు ప్రోత్సాహక బహుమతులుంటాయని పేర్కొన్నారు. కవితలు పంపే వారు తప్పనిసరిగా ఏదో ఒక కళాశాల లేదా యూనివర్సిటీ చదువుతుండాలని, మరిన్ని వివరాలకు 9848035573 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం


మాట్లాడున్న ఎస్పీ మాధవరెడ్డి

నల్లచెరువు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల గురించి ఎస్‌ఐ వరలక్ష్మితో చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. కదిరి డీఎస్పీ శ్రీలత, రూరల్ సీఐ శివశంకర్ నాయక్, ఏఎస్‌ఐ షెక్షావలి సిబ్బంది పాల్గొన్నారు.

6న ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-13 సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపిక చేస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు జీవీ అనిల్‌కుమార్, కార్యదర్శి సలీమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు జట్టు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలు, మూడు ఫొటోలు, ప్లేయర్ రిజిస్ట్రేషన్ ఫారం తీసుకుని హాజరుకావాలని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన జట్టు జోనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని అన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8099598958కు సంప్రదించాలన్నారు.

సంస్కరణలతో రైతులకు అండ

- అన్ని విధాలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయం
- దేశ ఆర్థిక వ్యవస్థకు కర్షకులే ఆయువు పట్టు
- వ్యవసాయ రంగం– సంస్కరణలపై చర్చాగోష్ఠిలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన సంస్కరణలతో రైతులకు అండగా నిలుస్తోంది. దేశంలో 62 శాతం ప్రజలకు జీవనాధారం వ్యవసాయ రంగమే. దేశ ఆర్థిక వ్యవస్థకూ రైతులే ఆయువుపట్టు లాంటివారు' అని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి బాబా మహా సమాధిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో 'వ్యవసాయ రంగం – సంస్కరణలు' అనే అంశంపై రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులతో వ్యవసాయ రంగంపై ప్రోత్సాహకర అంశాలు, లాభ నష్టాలపై ముఖాముఖి నిర్వహించారు.

వ్యవసాయానికి ఊతం

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయం దేశ, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని ఎంతో ప్రభావితం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, వ్యవసాయ రంగానికి ఊతమిస్తున్నాయన్నారు. పెట్టుబడికి ఆర్థిక సహకారం, పంట నష్టపోయిన వెంటనే పరిహారం, కొనుగోలు కేంద్రాలు, ఆర్‌బీకేలు, ఊళ్లోనే విత్తనాలు, ఎరువులు అందజేయడం, యంత్రసేవను అభివృద్ధి చేయడం వంటి సంస్కరణలు ఎంతో ఓదార్పుగా ఉన్నాయన్నారు.రాష్ట్రంతో పాటు రాయలసీమలో రూ.వేల కోట్లతో పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, ప్రకాశం బ్యారేజీ, గాలేరు నగరి వంటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి మేలు జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు.

నాలుగేళ్లలో రూ.27 వేల కోట్లు

నీతి అయోగ నివేదిక ప్రకారం దేశంలో దాదాపు 49 శాతం మందికి పైగా వ్యవసాయ రంగంతో ఉపాధి పొందుతున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయని కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం సంస్కరణల ఫలితమేనన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాలుగేళ్లలో 52.38 లక్షల మందికి రూ.27 వేల కోట్లు జమ చేసిందన్నారు. యంత్రసేవను అత్యధికంగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల స్థానం మన రాష్ట్రం నిలవడం సంతోషంగా ఉందన్నారు.

80 శాతం సబ్సిడీతో విత్తనాలు

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో సాధారణ సాగు 2.84 లక్షల హెక్టార్లు కాగా వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్ల కింద మాత్రమే 66 వేల హెక్టార్లలో పంటసాగైందన్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు ప్రత్యామ్నాయంగా ఉలవ, అలసంద, పెసర విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జిల్లా బోర్డు మెంబర్ రవిచంద్రారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పట్టు పరిశ్రమశాఖ అధికారి పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, శ్రీనాథ్, డైరెక్టర్ సీతారాములు, రైతులు పాల్గొన్నారు.

7 నుంచి మిషన్ ఇంద్రధనస్సు

- విజయవంతం చేయాలన్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: పుట్టిన బిడ్డ నుంచి 25 ఏళ్లు ఉన్న యువతీ యువకుల వరకూ వారి వయస్సుకు తగ్గట్టుగా వ్యాక్సినేషన్‌ను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రజలు, వైద్య సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. శుక్రవారం ప్రశాంతి గ్రామం వద్ద గల జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీకాలు వేసుకుంటే పూర్తిస్థాయిలో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రస్తుతం యూ–విన్ యాప్ ద్వారా పిల్లల వివరాలు నమోదు చేసుకుని అందులోనే వారి వ్యాక్సినేషన్ వివరాలు కూడా నమోదు చేస్తున్నారన్నారు. ఈనెల 7 నుంచి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1650 సెషన్స్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 4.24 లక్షల మంది పిల్లలకు నులి పురుగుల మాత్రలు అందజేయాలన్న లక్ష్యంతో ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రక్తహీనత కలిగిన గర్భిణులకు సేవలు అందించేందుకు జిల్లాలో పది 102 వాహనాలు పని చేస్తున్నాయన్నారు. గర్భిణులు అత్యవసర పరిస్థితులలో రక్తం పొందేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీఐఏ డాక్టర్ కిష్టయ్య, ప్రోగ్రాం అధికారి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ వద్ద సుబ్బమ్మ అనే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగ అపహరించాడు. బాధితురాలి వివరాలమేరకు.. బిసినివారిపల్లికి చెందిన పైడాకుల సుబ్బమ్మ కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి పక్కన సొంత ఇంటిలో కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఓ వ్యక్తి వచ్చి టీ ఉందా అని అడిగాడు. లేదని చెప్పడంతో సిగరెట్లు కావాలని అడిగాడు. సిగరెట్లను అందివ్వడానికి సుబ్బమ్మ దగ్గరకు రాగానే ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బంగారు గొలుసు విలువ రూ. 1.70 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ఎస్‌ఐ రాంభూపాల్‌ను వివరణ కోరగా ఇంకా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వెంకటగిరిలో నిర్వహించే అండర్-15 బాలికల క్రికెట్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో శుక్రవారం ఎంపిక ప్రక్రియ జరిగింది.

ఎంపికైన వారు...

కే.గౌతమి (కెప్టెన్) అనంతపురం, బి.నందిని (వైస్ కెప్టెన్) అనంతపురం, బి. చాయాశ్రీ (అనంతపురం), పి. తేజ దీపిక (ధర్మవరం), పి.కార్తీక (హిందూపురం), పి. సుమయాతాజ్ (అనంతపురం), పి. నిత్యారెడ్డి (కదిరి), పి. రోషర్ణ (అనంతపురం), ఏ. హాన్సిరెడ్డి (అనంతపురం) ,వీసీ రివ్య (గుత్తి) వై. శారద (కదిరి), బి. హిమవర్షిణి (అనంతపురం) , ఎస్. అంజుమ్ (అనంతపురం),జీఎస్ తేజశ్రీ (నార్పల), వి. కీర్తన (అనంతపురం)పి. షర్మాస్ వలీ (హెడ్ కోచ్), ఎస్. బిందు మాధవి (మేనేజర్)


జట్టులో స్థానం సంపాదించుకున్న క్రీడాకారులు

లెక్చరర్ కారుకు నిప్పు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని అశోక్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి కలకలం రేగింది. ఓ ఇంటి ముందు ఆపి ఉంచిన కారుకు దుండగులు నిప్పుపెట్టడంతో బాధితులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప వివరాలమేరకు.. స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న చంద్రశేఖరరెడ్డి కుటుంబం అశోక్‌నగర్‌లోని హరిహర ఆలయం సమీపంలో నివాసం ఉంటోంది. రోజువారిగానే ఇంటి ముందు కారు (క్రెటా)ను పార్క్ చేశారు. అయితే అర్ధరాత్రి 1 గంట సమయంలో కారు మంటల్లో తగలబడుతూ కనిపించింది. మంటలను ఆర్పిన అనంతరం చూడగా కారు కింద చెత్తాచెదారన్ని వేసి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. ఎవరో కావాలనే ఈ పని చేశారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే తమకు ఎవరితోనూ శతృత్వం లేదని చంద్రశేఖర్ చెబుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆర్ట్స్ కళాశాలలో 'నాక్' బృందం పరిశీలన

రాప్తాడురూరల్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందం సభ్యులు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో కలియతిరిగారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రొఫెసర్ దామోదర్ మిశ్రా (చైర్మన్), రామచంద్రమోహన్, సుజాత వచ్చారు. ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, నాక్ కోఆర్డినేటర్ అచ్యుతానంద, సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కళాశాల అభివృద్ధి, ఐదేళ్లలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రిన్సిపాల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సభ్యులు పలు ప్రశ్నలు అడిగారు. అకడమిక్, పరిశోధన, ఉన్నత విద్య, ఉపాధిపరంగా విద్యార్థులు సాధించిన ప్రగతిని కోఆర్డినేటర్ అచ్యుతానంద వివరించారు. అనంతరం కామర్స్, తెలుగు, బాటనీ, జువాలజీ, చరిత్ర తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో సాధించిన ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను ఫొటో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సాధించిన విజయాలను వివరించాయి. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందితో 'నాక్' బృందం సభ్యులు వేర్వేరుగా మాట్లాడారు. సాయంత్రం డ్రామా హాలులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను సభ్యులు తిలకించారు. కాగా శనివారం కూడా నాక్ కమిటీ సభ్యులు వివిధ విభాగాలను సందర్శించనున్నారు.


అధ్యాపకులతో మాట్లాడుతున్న 'నాక్' బృందం

చీడ పీడల నుంచి పంటలను రక్షించుకోండి


వేరుశనగ పంట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలకు వచ్చే చీడ పీడలను సకాలంలో గుర్తించి పంటలను రక్షించుకోవాలని ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లిలో వ్యవసాయాధికారులు ఏడీఏ సనావుల్లా, ఏఓ వెంకట్‌బ్రహ్మం తదితరులు పరిశీలించారు. కొట్లపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంటను పరిశీలించగా కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాక్షమ్మ, కుల్లాయిరెడ్డి, ఆదెప్ప , రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు విలువలు పాటించాలి

పుట్టపర్తి అర్బన్: వార్తలు రాసే సమయంలో జర్నలిస్టులు విలువలు పాటించాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు వాస్తవాలను గ్రహించి జర్నలిజం విలువలను పాటిస్తూ వార్తలు రాయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై అసత్య ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి ఎంత మాత్రం మంచిది కాదన్నారు. ప్రతి శనివారం రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

జూనియర్ లైన్‌మెన్లు రెగ్యులర్

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్లుగా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ లైన్‌మెన్లు 380 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరందరినీ రెగ్యులర్ చేశామని, విద్యుత్ సంస్థ నిబంధనల మేరకు జీతాలతోపాటు అలవెన్సులు, పీఆర్‌సీ అమలు చేయనున్నామని తెలిపారు.

జూదరుల అరెస్ట్


నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మడకశిర: మండలంలోని దొడ్డేపల్లి వద్ద శుక్రవారం ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. వారి నుంచి రూ. 73,400 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మూడు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విధివంచితులు

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు


మృతి చెందిన దంపతులు మంజుల, నాగార్జున (ఫైల్)


అనాథలైన చిన్నారులు

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. అన్యం పుణ్యం తెలీని చిన్నారులను అనాథలుగా మార్చేసింది. అనంతపురం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నాగార్జున, మంజుల దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు (విష్ణుప్రియ (7), హరిప్రియ (5), మధుప్రియ (3)) సంతానం. దంపతులిద్దరూ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత శనివారం మంజుల మేనత్త మృతి చెందినట్లు సమాచారం అందడంతో తనకల్లు మండలం సీఆర్ పల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గుమ్మల్లకుంట వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన మంజుల (30), నాగార్జున (34)లను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంజుల మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే చికిత్స పొందుతూ నాగార్జున కూడా శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీంతో వారి ముగ్గురు బిడ్డలు అనాథలయ్యారు. జరిగింది అర్థం కాక అమ్మానాన్న ఎక్కడున్నారు? ఎప్పుడొస్తారు? అని అడుగుతున్నారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం వంగంపల్లిలోని పూజారి మాధవరాజు ఇంట్లో గత నెల 29న గ్యాస్ లీకేజీ అయి భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో గాయపడిన రాజేశ్వరి (45) చికిత్స పొందుతూ శుక్రవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందారు. గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమార్తె మహిత కొత్తచెరువు పోలీస్టేషన్‌లో ఎస్‌ఐ లింగన్నకు ఫిర్యాదు చేశారు.


గ్యాస్ ప్రమాదంలో గాయపడిన రాజేశ్వరి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని యువకుడు (35) మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామ రోడ్డు సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో 35 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడన్నారు. రెండు రోజులుగా మతిస్థిమితం లేకుండా రెండ్రోజులుగా రోడ్డుపై తిరుగుతున్నాడని స్థానికులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ సెల్ 9440796817ను సంప్రదించాలన్నారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడు..

బత్తలపల్లి: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి కాలు జారి కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు మేరకు... మండలంలోని రాఘువంపల్లికి చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి (52) తిరుపతిలో ఉన్న వ్యానును తీసుకువచ్చేందుకు రైలులో వెళ్తున్నాడు. రైలు మదనపల్లి సీటీఎం రైల్వే స్టేషన్ దగ్గర రైలు దిగి ఎక్కే సమయంలో కాలు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య కాంతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మదనపల్లి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.


ఈశ్వర్‌రెడ్డి(ఫైల్)

పారా బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక

అనంతపురం: 6వ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ -2023 ఈ నెల 15న విశాఖలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. వివిధ కేటగిరిలో 12 మంది క్రీడాకారులు ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన వారు..

ఉమాపతి మహేష్ కుమార్ (ఎస్ఎల్ -4), వై. గౌతమి (ఎస్‌యూ–5), ఎం. సతీష్ కుమార్ (ఎస్–3) వీఏజీ వన్నూర్ స్వామి (ఎస్ఎల్–3), ఆర్. భార్గవి (ఎస్‌యూ–5) సి. తరుణ్ (ఎస్‌యూ–5), కే.లక్ష్మి కుమార్ (ఎస్ఎల్–4), ఎం. అభిషేక్ (ఎస్ఎల్–3), ఏ. బాబయ్య(ఎస్ఎల్–4) ఆర్. నాగరాజు (డబ్ల్యూ హెచ్–2), ఎన .శ్రీనివాసులు (డబ్ల్యూ హెచ్–2), గాలి నందకుమార్ రెడ్డి (ఎస్ఎల్–3).

భవనంపై నుంచి జారిపడి బేల్దారి మృతి

రాయదుర్గంటౌన్: పనిచేస్తూ భవనపై నుంచి పడి ఓ నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన రాయదుర్గం పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డు దండు మారెమ్మ గుడి సమీపంలో జరిగింది శుక్రవారం జరిగింది. పట్టణంలోని 22వ వార్డు అంబేడ్కర్ ఫస్ట్ క్రాస్‌లో నివాసం ఉంటున్న సిద్ధేశ్వర కుమారుడు శ్రీనివాసులు (23) దండుమారెమ్మ గుడి సమీపంలో ఓ కొత్త భవన నిర్మాణంలో భాగంగా బేల్దారి పనికి వెళ్లాడు. అయితే పై అంతస్తులో పనిచేస్తుండగా శ్రీనివాసులు కాలు జారీ పడటంతో తలకు తీవ్రమైన రక్తగాయాలయ్యాయి. బళ్లారి విమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

అలరించిన సంగీత కచేరి

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన యునైటెడ్ కింగ్‌డమ్ సత్యసాయి భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. శుక్రవారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.




సంగీత కచేరిలో పాల్గొన్న యునైటెడ్ కింగ్‌డమ్ భక్తులు (ఇన్‌సెట్‌లో) సత్యసాయి మహా సమాధి